క్లుప్తంగా

కార్మిక ఉద్యమాలతోనే హక్కులు సాధ్యం



మాట్లాడుతున్న సీహెచ్ శంకర్

జ్యోతినగర్: కార్మిక ఉద్యమాలతోనే హక్కులు సాధ్యమవుతాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సీహెచ్ శంకర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని నిర్వీర్యం చేసేందుకు కార్మిక చట్టాలను కుదింపు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. కార్మికవర్గ శ్రేయస్సును కాపాడేందుకే మే 20న జాతీయస్థాయిలో సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సమ్మెను విజయవంతం చేయడంతో పాటు మేడే కార్మిక దినోత్సవ కార్యక్రమంలో సంఘటిత, అసంఘటిత రంగం కార్మికులు పాల్గొని నివాళి అర్పించాలని కోరారు. బుచ్చన్న, రాయమల్లు, గుండు సుధాకర్, కొమురయ్య, ప్రవీణ్, తిరుపతి, నర్సయ్య, చందు పాల్గొన్నారు.

బీరన్న కొలుపు ఉత్సవాలు



కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామంలో గొల్లకురుమలు నాలుగు రోజుల నుంచి బీరన్న కొలుపు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బీరన్న లగ్న పట్నాల కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.

పవర్‌లూమ్స్ కార్మికుల బంద్



నిరసన తెలుపుతున్న సభ్యులు, కార్మికులు

జూలపల్లి: కశ్మీర్‌లో ఉగ్రవాదులు పర్యాటకులను చంపడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో పద్మశాలీ సంక్షేమ సంఘం, చేనేత, పవర్ లూమ్స్ కార్మికులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. సంఘ భవనం వద్ద నిరసన తెలిపి మృతులకు నివాళి అర్పించారు. సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు మేరుగు రమేశ్, అందె రాజయ్య, సత్యం, ఉప్పుల తిరుపతి, రుద్ర రాజేశం, మేరుగు కనుకయ్య, దీకొండ పోచమల్లు, రాజేశ్వర్, వెంకటేశం, భూమయ్య, కొండ విజయమ్మ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ పార్క్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి



ఆందోళన చేస్తున్న వాకర్స్

గోదావరిఖని: స్థానిక ఫైవింక్లయిన్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్క్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని అసోసియేషన్ నాయకులు కోరారు. పార్క్ పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉండి, పూర్తిగా శిథిలావస్థకు చేరుకొందన్నారు. దీనిపై పోరాడితే అప్పటి సింగరేణి జీఎం రూ.70లక్షలకు పైగా నిధులు కేటాయించారన్నారు. దీంతో పార్కు నేడు అందంగా మారి ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. కానీ కనీస సౌకర్యాలు పార్కులో లేవన్నారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, ఓపెన్ జిమ్ సౌకర్యం కల్పించాలని, పార్క్‌కు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ చేయాలన్నారు. ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ ఉపాధ్యక్షుడు రేణికుంట్ల నరేంద్ర, వాకింగ్ అసోసియేషన్ నిర్వాహకులు రేణికుంట్ల నరేంద్ర, దాసరి రాజు, పనుగంటి రవి, మహేశ్, శ్రీనివాస్, మల్లేశ్, సుధాకర్, కొమరయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రత్యేక బహుమతి

ఎలిగేడు: పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మార్కులే ప్రాధాన్యం కాదని పాఠశాలకు ప్రతీరోజు క్రమం తప్పకుండా రావడం వలన క్రమశిక్షణ, జ్ఞానం పెరుగుతుందని మండలంలోని ముప్పిరితోట అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లిలోని పాఠశాల ఉపాధ్యాయుడు రాజేశ్‌కుమార్ అన్నారు. పాఠశాలలో బడికి ఎక్కువ రోజులు వచ్చిన రేచవేని హిమనికి ఉపాధ్యాయుడు రాజేశ్‌కుమార్ ప్రత్యేక బహుమతి అందజేశారు. 5వ తరగతిలో చెప్పిన పాఠాన్ని శ్రద్ధగా విని దైనందిన జీవితంలో ఉపయోగించి సమస్య పరిష్కరించిన విద్యార్థిని మౌనికను అభినందించారు.





రైల్వే గేట్ వద్ద చలువ పందిళ్లు

మండుతున్న ఎండలతో జనం బెంబేలెత్తుతున్నారు. భానుడి ప్రతాపానికి ఉక్కిరిబిక్కిరవుతూ పగలే చుక్కలు చూస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. అయితే పెద్దపల్లిలోని రైల్వే గేటు వద్ద గంటల కొద్దీ ప్రయాణికులు నిరీక్షిస్తుండడంతో అధికారులు ఎండ తీవ్రత దృష్ట్యా చలువ పందిళ్లు ఏర్పాటు చేసి కాస్త ఉపశమనం కలిగించారు. నాలుగు రోజుల క్రితం గేటు పడడంతో స్థానిక ఎమ్మెల్యే గంటల కొద్దీ గేటు వద్దే ఉండిపోయారు. ఎండ తీవ్రత ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు సమస్య తెలిపారు. దీంతో మున్సిపల్ అధికారులు రైల్వే గేటు వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం చలువపందిళ్లు ఏర్పాటు చేశారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



రామగుండం: కార్పొరేషన్ 22 డివిజన్‌లోని రామగుండం పట్టణ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫెన్సింగ్ లోపల పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయి విద్యుత్ తీగలకు చుట్టుకున్నాయి. విద్యుత్ అంతరాయం లేదా షార్ట్ సర్క్యూట్ జరగకముందే ఎన్పీడీసీఎల్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలు శుభ్రం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



యైటింక్లయిన్‌కాలనీ: టీబీజీకేఎస్ నాయకులు



కాల్వశ్రీరాంపూర్: సభకు తరలుతున్న నాయకులు



పాలకుర్తి: సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులు



కమాన్‌పూర్: సభకు తరలుతున్న నాయకులు



రామగుండం: సభకు తరలుతున్న పార్టీ శ్రేణులు

రామగుండం/ధర్మారం/యైటింక్లయిన్‌కాలనీ/ఓదెల/పాలకుర్తి/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/ఎలిగేడు/కమాన్‌పూర్/జూలపల్లి: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఏర్పాటు చేసిన రజతోత్సవ సభకు పార్టీ నాయకులు తరలివెళ్లారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చౌరస్తాలో పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు బస్సులు, కార్లలో సభకు తరలివెళ్లారు.

కాంగ్రెస్ పాలనలో ప్రగతి వెనక్కిపోయింది



జెండా ఎగురవేస్తున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: కాంగ్రెస్ పాలనలో పదేళ్ల ప్రగతి ప్రస్థానం వెనక్కిపోయిందని, రాష్ట్ర ప్రజలు దిగాలు పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రామగుండం నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంభమేళా తరహాలో రజతోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గం నుంచి 5వేల మంది తరలివెళ్లారన్నారు. నాయకులు పీటీ స్వామి, కౌశిక హరి, పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, చెలకలపల్లి శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, ఇరుగురాళ్ల శ్రావణ్, చింటూ, బచ్చాల రాములు, వెంకటేశ్, ఓదెలు పాల్గొన్నారు.

బొగ్గుగనులపై అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: బొగ్గుగనులపై అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న కార్మికులను ఆదుకోవాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. స్థానిక యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ కృషి చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు వైఫల్యం చెందాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలు వెంటనే సంస్థకు చెల్లించాలన్నారు. సింగరేణివ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు సంగాని సాంబయ్య, మాదాసి రవీందర్, గంగిశెట్టి నరసింహులు, ఎల్లావుల కోటయ్య, చెన్న సతీశ్, పెంచాల వెంకటస్వామి, దాట్ల లక్ష్మయ్య, పల్లె శ్రీనివాస్, పోతరాజు భాస్కర్, తుమ్మ గట్టయ్య, పుప్పాల నాగేంద్రప్రసాద్, నూతి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



సుల్తానాబాద్: పార్టీ జెండా ఆవిష్కరణ



ఎలిగేడు: ధూళికట్టలో..



ధర్మారం: ఆవిర్భావ వేడుకల్లో నాయకులు



జ్యోతినగర్: జెండా ఆవిష్కరిస్తున్న అభిషేక్‌రావు



జూలపల్లిలో జెండా ఆవిష్కరణ

జ్యోతినగర్/ఎలిగేడు/సుల్తానాబాద్/ధర్మారం/జూలపల్లి: బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ గ్రామగ్రామాన, పట్టణాల్లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

• పేద కుటుంబానికి ఆర్థికసాయం

సుల్తానాబాద్: పట్టణంలోని గౌడ వీధిలో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి చెందిన బత్తిని మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి అండగా నిలవాలన్న ఆలోచనతో సుల్తానాబాద్ ప్రభుత్వ హైస్కూల్ 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.25వేలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.25వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. బాండు పత్రాలు ఆదివారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై నారాయణబాబు, శ్రీనివాస్, శ్రీనివాస్, భాస్కర్, శ్రీనివాస్, రాజు ఉన్నారు.

• దుద్దిళ్ల కుటుంబంపై విమర్శలు సరికాదు

మంథని: మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నియోజకవర్గ అభివృద్ధిపై దుద్దిళ్ల కుటుంబంపై విమర్శలు చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ నాయకులు సాదుల శ్రీకాంత్, ఎరుకల ప్రవీణ్ అన్నారు. మంథనిలో ఆదివారం వారు మాట్లాడారు. ఇసుక అధిక లోడ్ తరలింపుతో మంథని మండలం అడవిసోమన్‌పల్లి వంతెన శిథిలావస్థకు చేరిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో నియోజకవర్గ అభివృద్ధికి రూ.వందల కోట్ల నిధులను మంత్రి శ్రీధర్‌బాబు తీసుకొచ్చారన్నారు. నాయకులు రాజు, చంద్రు విజయ్ ఉన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి నరేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో ఆదివారం నల్లజెండాలతో నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు రెండురోజులు నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకన్న, అశోక్, శంకర్, రామకృష్ణ, రాజేశం, మొగిలి, మల్లేశం, బుచ్చమ్మ, మంగ, రవికుమార్, కొమురయ్య, కాంతయ్య, ప్రసాద్, రాయమల్లు, రాజనర్సు, సుధాకర్, పోచయ్య, స్వామి, నారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్ విద్యార్థినికి గురుకులంలో సీటు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న రేచవేని హిమని బీసీ వెల్ఫేర్ సుల్తానాబాద్ గురుకుల పాఠశాలలో సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల హెచ్ఎం రామ్మోహన్, ఉపాధ్యాయులు రాజేశ్‌కుమార్ అభినందించారు.



సింగరేణి వార్తలు

వైద్యసేవలపై అప్రమత్తంగా ఉండాలి



తనిఖీ చేస్తున్న డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్

గోదావరిఖని: వైద్యసేవలపై డాక్టర్లు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సింగరేణి సీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. ఆర్జీ–2 ఏరియా డిస్పెన్సరీని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. డిస్పెన్సరీలో ఉన్న సదుపాయాలు, మందులు, వైద్యసిబ్బంది, పారామెడికల్ సిబ్బంది తదితర విషయాలపై ఆరా తీశారు. వేసవికాలం దృష్ట్యా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. వేసవికాంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

బొగ్గుబ్లాకులు కేటాయించకుండా అడ్డుపడుతున్నారు



మాట్లాడుతున్న సాయిబాబు

గోదావరిఖని: బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించకుండా, విస్తరణకు కేంద్రం అడ్డుపడుతోందని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు ఆరోపించారు. స్థానిక రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. రానున్న కాలంలో ప్రభుత్వ రంగ సంస్థలకు వేతన సవరణ అనేది ప్రశ్నార్థకం కాబోతుందన్నారు. మే20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు భూపాల్, తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు, బలుగూరి మధు, వేల్పుల కుమారస్వామి, బిక్షపతి, మెండె శ్రీనివాస్, ఎర్రవెల్లి ముత్యంరావు, జి.జ్యోతి పాల్గొన్నారు.

కార్మికులను చైతన్యం చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సంస్థలో యువకార్మికులను చైతన్యవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని కార్మిక సంఘాలు పైరవీలతో పనులు అవుతాయనేలా కార్మికుల్లో అపోహలు కల్పిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లతో భవిష్యత్‌లో కార్మికులు సమ్మె చేసే హక్కు కోల్పోతారన్నారు. కార్మికులను బానిసలుగా మార్చడానికి బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని కార్మిక సంఘాలు వచ్చేనెల 20న ఇచ్చిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహారావు, ఆరెపల్లి రాజమౌళి, ఎస్.వెంకటస్వామి, మెండె శ్రీనివాస్, కుంట ప్రవీణ్, దొమ్మేటి కొమురయ్య, అల్లి రాజేందర్, గుల్ల బాలాజీ, కంపెటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-1లో సర్వే మజ్దూర్ల ఎంపిక



ఎంపికకు హాజరైన అధికారులు

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా స్థానిక సెక్టార్–2 పాఠశాలలో ఆదివారం సర్వే మజ్దూర్ ఎంపిక నిర్వహించారు. అంతర్గత అభ్యర్థులతో ఈ నియామకం చేపట్టారు. 199 మంది అభ్యర్థులు హాజరు కాగా ఖాళీల భర్తీని పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక పూర్తయినట్లు తెలిపారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఈదురుగాలులతో ఇళ్లను కప్పేసిన ఎన్టీపీసీ బూడిద

రామగుండం: ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన కుందనపల్లి, అక్బర్‌నగర్‌కాలనీలో శనివారం అర్ధరాత్రి వీచిన ఈదురుగాలులతో సమీపంలోని బూడిద చెరువు నుంచి భారీగా బూడిద లేచి ఇళ్లను కప్పేసింది. ఓ దశలో సమీప రైల్వే సిగ్నల్స్ సైతం కనిపించని దుస్థితి నెలకొంది. నాలుగు రోజుల క్రితం బూడిద పైపు పగిలి ఇళ్లను ముంచెత్తిన ఘటన మరువకముందే మళ్లీ గ్రామాలపై బూడిద పంజా విసరడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా ఎన్టీపీసీ అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఏటా ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వీచే ఈదురుగాలులకు ముందస్తుగా బూడిద చెరువులో నీటిని స్ప్రింక్లింగ్ చేస్తూ గాలికి లేవకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన ఎన్టీపీసీ యాజమాన్యం ఏలాంటి చర్యలకు పూనుకోకపోవడంపై ఈ దుస్థితి నెలకొందని స్పష్టమవుతుంది. దీనిపై ఎమ్మెల్యే స్పందించాలని, బూడిద లేవకుండా నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సుల్తానాబాద్: 1999-2000 బ్యాచ్ విద్యార్థులు



సుల్తానాబాద్‌రూరల్: 1982-83 బ్యాచ్.



కమాన్‌పూర్ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ జెడ్పీ హైస్కూల్ బాలుర పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. గురువులను సన్మానించారు.

42ఏళ్లకు ఒకే వేదికపై..

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 1982–83లో పదో తరగతి చదివిన పూర్వ ఆత్మీయ సమ్మేళనం మండలంలోని నర్సయ్యపల్లె విజయగార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. 42ఏళ్ల అనంతరం ఒకే వేదికపై వీరంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి పాదాభివందనం చేశారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.